ఓటర్ స్పెషల్ డ్రైవ్‌లో 8 దరఖాస్తుల స్వీకరణ



మూసాపేటలోని ప్రభుత్వ పాఠశాలలో ఓటర్ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న బీఎల్‌ఓలు

మూసాపేట: ఓటర్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా మూసాపేటలోని ప్రభుత్వ పాఠశాలలోని బూత్‌లో బీఎల్‌ఓలు ప్రజల నుంచి ఓటు నమోదు కోసం దరఖాస్తు ఫారంలను ఆదివారం స్వీకరించారు. ప్రభుత్వ పాఠశాలలోని 178, 179, 180, 181, 186 బూత్‌లలో కొత్త ఓటర్ నమోదు, పేర్లు, చిరునామా మార్పు చేర్పుల కొరకు మొత్తం 8 మంది దరఖాస్తు చేస్తున్నారు. శనివారం కేవలం ఒక్కరు మాత్రమే ఈ అవకాశాన్ని వినియోగించుకున్నారని అధికారులు తెలిపారు. స్పెషల్ డ్రైవ్ నిర్వహించినా ప్రజలు రాకపోవటానికి పెద్దగా ఆసక్తి కనపరచటం లేదు. అంతేకాకుండా అధికారులు కూడా సరైన ప్రచారం నిర్వహించకపోవటం కూడా కారణమై ఉంటుందని పేర్కొంటున్నారు.

డివిజన్‌లోని విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తా

కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్



పీజేఆర్‌నగర్‌లో విద్యుత్ సమస్యలను పరిశీలిస్తున్న కార్పొరేటర్

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని పీజేఆర్ నగర్ ఫేజ్-2, గాంధీనగర్ కాలనీల్లో విద్యుత్ స్తంభాలు, విద్యుత్ వైర్లతో సమస్యగా ఉందని కాలనీవాసులు స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ మేరకు కార్పొరేటర్ ఆదివారం కాలనీలో పర్యటించి సమస్యను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. గతంలో కూడా పీజేఆర్‌నగర్, గాంధీనగర్ కాలనీలకు అవసరమైన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశామన్నారు. అదే విధంగా కాలనీ ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చిన విద్యుత్ సమస్యలను సంబంధిత విద్యుత్ శాఖ అధికారులతో చర్చించి త్వరగా పరిష్కరించే విధంగా చూస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, ఉపాధ్యక్షుడు చిన్నోళ్ల శ్రీనివాస్, రామస్వామి, షకీల్ మున్నా, సలీమ్, భిక్షపతి, మోజెస్, పోశెట్టిగౌడ్, సాయిగౌడ్, మహిళా గౌరవ అధ్యక్షురాలు మధులత, నస్రీన్, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

తిరుమల తిరుపతికి మహా పాదయాత్ర



మహా పాదయాత్రలో పాల్గొన్న భక్తులు

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ కాలనీ నుంచి ఆదివారం శ్రీవారి తిరుమల మహా పాదయాత్ర ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శక్తివాహిని ఫౌండర్ మౌనిక సుంకర, డాక్టర్ రామ్‌సింగ్, యాంజాల పద్మయ్య, బాలకృష్ణ గురుస్వామి, డాక్టర్ రాకేష్, భీమ్‌రెడ్డిలు పాల్గొన్నారు. కార్యక్రమంలో లక్ష్య సాధన ఫౌండేషన్, ఛత్రపతి శివాజీ యువసేన ఆధ్వర్యంలో నిర్వహించారు.

బబ్బుగూడ అధ్యక్షుడిగా వెంకటేశ్వరరావు



వెంకటేశ్వరరావుకు నియామక పత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారి చాంద్ పాషా

మోతీనగర్: బబ్బుగూడను బంగారు బబ్బుగూడగా మార్చడానికి తన శక్తివంచన లేకుండా కృషి చేస్తానని సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా గెలుపొందిన బోడ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం మూసాపేట డివిజన్ బబ్బుగూడ సంక్షేమ సంఘం అధ్యక్ష బరిలో ముగ్గురు ఉండగా సమీప అభ్యర్థులైన మాజిద్‌ఖాన్, సయ్యద్ సలీంలపై బి. వెంకటేశ్వరరావు గెలుపొందారని ఎన్నికల అధికారి చాంద్ పాషా తెలిపారు. మూసాపేట డివిజన్‌లోనే బబ్బుగూడను ఆదర్శ కాలనీగా తీర్చిదిద్దుతానని వెంకటేశ్వరరావు పేర్కొన్నారు.

గౌడ సంఘం భవన నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న మాచర్ల భద్రయ్య తదితరులు

ఆల్విన్‌కాలనీ: గౌడ సంఘం భవన నిర్మాణానికి బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు మాచర్ల భద్రయ్య ఆదివారం రూ.10వేల విరాళాన్ని గౌడ సంఘం అధ్యక్షుడు గుండగోని జంగయ్యగౌడ్‌కు ఆదివారం అందజేశారు. కూకట్‌పల్లి జగద్గిరిగుట్ట రిక్షాపుల్లర్స్ కాలనీలోని మాచర్ల భద్రయ్య, పద్మ దంపతుల నివాసంలో విరాళానికి సంబంధించిన చెక్కును నోముల గ్రామ గౌడ సంఘం నాయకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు కొప్పు వెంకటేశ్వర్‌గౌడ్, బాదిని యాదయ్యగౌడ్, రాచకొండ పాపులుగౌడ్ తదితరులు ఉన్నారు.

ఆఫ్టర్ స్కూల్ ప్రోగ్రామ్ అభినందనీయం

నిజాంపేట్: లైఫ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆఫ్టర్ స్కూల్ ప్రోగ్రామ్‌ను నిర్వహించేందుకు ముందుకు రావడం అభినందనీయమని నిజాంపేట్ 6వ డివిజన్ కార్పొరేటర్ సత్యవాణి అన్నారు. డాక్టర్ తోలేటి బుల్లి సోమేశ్వరరావు సౌజన్యంతో లైఫ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులకు స్థానిక అంగన్వాడీ స్కూల్‌లో ఆఫ్టర్ స్కూల్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా లైఫ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా ట్యూషన్ చెప్పడంతో పాటు వారిలో సాఫ్ట్ స్కిల్స్‌ను మెరుగుపరిచేందుకు ఈ శిక్షణ ఇస్తున్నామని అన్నారు.



500 ఏళ్ల కల

నెరవేరే క్షణం ఇది

కూకట్‌పల్లి పురవీధుల్లో ఆధ్యాత్మిక శోభ





శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర సంచాలన సమితి కూకట్‌పల్లి ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో పన్నాల హరీష్‌రెడ్డి, వడ్డేపల్లి రాజేశ్వరరావు, రామభక్తులు

కూకట్‌పల్లి: శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర సంచాలన సమితి కూకట్‌పల్లి వారి ఆధ్వర్యంలో ఆదివారం కూకట్‌పల్లి డివిజన్‌లోని రామాలయం నుంచి భక్తులు బైక్ ర్యాలీ నిర్వహించారు. మేడ్చల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొని బాలాజీనగర్, కేపీహెచ్‌బీకాలనీ, భాగ్యనగర్ కాలనీ, వివేకానందనగర్ కాలనీల మీదుగా రామాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా శ్రీరాముల వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

◆ ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ.. 500 ఏళ్ల హిందువుల కల నేటితో నెరవేరుతుందన్నారు. ఈ ర్యాలీతో హిందువుల ఐక్యత మరోమారు రుజువైందన్నారు. ఈ ర్యాలీకి అనేక మంది హారతులతో స్వాగతం పలికారన్నారు. సోమవారం సాయంత్రం ప్రజలు తమ ఇళ్ల వద్ద దీపాలు వెలిగించాలన్నారు. అందరికీ అయోధ్య బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ శుభాకాంక్షలు తెలిపారు.

నేడు అయోధ్య రామయ్య ప్రాణప్రతిష్ఠ



- వేడుక మహోత్సవానికి సిద్ధమైన భక్తులు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు, భారీ స్క్రీన్‌లలో వేడుక వీక్షణ

మూసాపేట: అయోధ్య శ్రీరామ జన్మభూమి మందిరం ప్రారంభ, రామ్‌లల్లా ప్రాణప్రతిష్ఠ ఉత్సవానికి యావత్ దేశంతో పాటు కూకట్‌పల్లి నియోజకవర్గ ప్రజలు కూడా సిద్ధమయ్యారు. వాడవాడలా ఆ బాలరాముడి మహోత్సవాన్ని కనులారా వీక్షించేందుకు ఎల్‌ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేస్తున్నారు.ఆ శ్రీరాముని పట్టాభిషేకం చూడకపోయినా ఆ బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ మహోత్సవం చూసే అవకాశం కలగటం తమ అదృష్టమని భక్తులు పేర్కొంటున్నారు.

◆ ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, హోమాలు, దీపాలంకరణ వంటి పూజలతో పాటు పలువురు నిర్వాహకులు భారీ స్క్రీన్‌లు ఏర్పాటు చేయటం, శోభాయాత్ర, బాణసంచా కాలుస్తూ సంబరాలు చేసుకోవటానికి సిద్ధంగా ఉన్నారు. ఆ త్రేతాయుగమే మళ్లీ ఈ క్షణం తమ ముందుకు వచ్చిందా అన్నట్లుగా ప్రజలు, భక్తులు భావిస్తూ వేడుకలు నిర్వహించనున్నారు.

◆ ఇప్పటికే ఇళ్లకు అయోధ్య శ్రీ రాముని అక్షింతలు చేరాయి. వీటిని సోమవారం ఆలయ ప్రారంభోత్సవం అనంతరం పూజలు నిర్వహించి తలపై అక్షింతలు వేసుకోవాలని రామభక్తులు తెలిపారు. సాయంత్రం ప్రతి ఇంట్లో ఐదు దీపాలు వెలిగించాలన్నారు.

ఈరోజు ఆలయాల్లో ప్రత్యేక పూజలు...

◆ భరత్‌నగర్ కాలనీలోని హరిహర క్షేత్రంలోని శ్రీరాముడి ఆలయంలో ప్రత్యేక పూజలు జరగనున్నాయి. ఇక్కడ ఆదివారం కూడా ప్రత్యేక హోమం నిర్వహించారు. సోమవారం ప్రత్యేక పూజలు, అలంకరణ అనంతరం విష్ణు సహస్ర నామార్చన, శ్రీరామ స్తోత్ర పఠనం, సామూహిక మహిళలచే ఉంటుందన్నారు. సాయంత్రం దీపాలంకరణ నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు.

◆ అదే విధంగా కూకట్‌పల్లిలోని శ్రీ రంగనాయక స్వామి ఆలయంలో శ్రీరామ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా ఉదయం 10 గంటలకు సుందరకాండ హోమం, సాయంత్రం 5.30 గంటలకు దీపోత్సవం ఉంటుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

◆ మూసాపేటలోని శ్రీ సాయిబాబా ఆలయంలో, జనతానగర్‌లోని మున్సిపల్ కార్యాలయం సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

ఆంజనేయస్వామి విగ్రహ ఆవిష్కరణ...

◆ మహావీర్ భక్త మండలి ఆధ్వర్యంలో హనుమాన్ చౌక్ వద్ద సాయంత్రం 5గంటలకు ఆంజనేయ స్వామి విగ్రహ ఆవిష్కరణ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఆంజనేయస్వామి ఆలయం నుంచి హనుమాన్ చౌక్ వరకు సీతారాముల విగ్రహాల ఊరేగింపు ఉంటుందన్నారు. ఈ వేడుకలకు మాజీ ఎమ్మెల్యే, బీజేపీ సీనియర్ నాయకులు ఈటల రాజేందర్ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు.

కాలనీలు కాషాయమయం

అట్టహాసంగా శ్రీరాముడి యాత్రకు ఏర్పాట్లు



హనుమధ్వజ పట్టుకుని జై శ్రీరామ్ అని నినాదాలు చేస్తున్న చిన్నారులతో బీజేవైఎం రాష్ట్ర నాయకుడు కన్నె ప్రకాశ్



అంజయ్యనగర్‌లో ఏర్పాటు చేసిన కాషాయ తోరణాలు

ఓల్డ్‌బోయిన్‌పల్లి: అయోధ్య రామ మందిరంలో సోమవారం శ్రీరాముడి ప్రాణప్రతిష్ఠాపన ఉత్సవాన్ని పురస్కరించుకొని ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో యాగాలు, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. అదే విధంగా దేవాలయాల పరిసరాలు, కాలనీలు కాషాయమయంగా మారాయి. ఓల్డ్ బోయిన్‌పల్లి యాదవబస్తీలోని అంజనేయస్వామి ఆలయం, హస్మత్‌పేట్‌లోని అభయాంజనేయస్వామి ఆలయం, అంజయ్యనగర్‌లోని శ్రీవీర అభయాంజనేయస్వామి ఆలయాల్లో అన్నదానాలు, భజన, సాంస్కృతిక కార్యక్రమాలకు ఏర్పాట్లు చేశారు. దుబాయిగేట్, అంజయ్యనగర్, హస్మత్‌పేట, ఓల్డ్ బోయిన్‌పల్లి చౌరస్తా, మల్లికార్జుననగర్ తదితర కాలనీల్లో కాషాయ తోరణాలు, శ్రీరామ, హనుమ ధ్వజాలు రెపరెపలాడుతున్నాయి.

నేడు ప్రభు శ్రీరామచంద్రుడి శోభాయాత్ర



శ్రీరామ శోభయాత్రకు జగదీశ్వర్‌గౌడ్‌ను ఆహ్వానిస్తున్న మహా శృంగదాస్

ఆల్విన్‌కాలనీ: శ్రీరామచంద్ర ప్రభు శోభాయాత్రను సోమవారం నిర్వహించనున్నట్లు ఇంటర్నేషనల్ ఇస్కాన్, కూకట్‌పల్లి బాగ్ నిర్వాహకులు మహా శృంగదాస్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. హైదర్‌నగర్‌లోని శ్రీవిజయలక్ష్మి దేవాలయం వద్ద మధ్యాహ్నం 2గంటల నుంచి శోభాయాత్ర ప్రారంభమై జేఎన్‌టీయూ, కేపీహెచ్‌బీ, వివేకానంద నగర్, కూకట్‌పల్లి మీదుగా నైనా గార్డెన్స్ వరకు కొనసాగనుందని తెలిపారు. రామభక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి ఎమ్మెల్యేలు అరెకపూడి గాంధీ, మాధవరం కృష్ణారావు, శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ జగదీశ్వర్‌గౌడ్, కార్పొరేటర్లు పాల్గొనున్నారని తెలిపారు.

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రజానాయకుడు

మల్కాజ్‌గిరి పార్లమెంటరీ సమావేశంలో ఎమ్మెల్యే కేటీఆర్



మల్కాజ్‌గిరి పార్లమెంటరీ బీఆర్‌ఎస్ ఎన్నికల సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే



సమావేశంలో పాల్గొన్న కూకట్‌పల్లి నియోజకవర్గ కోఆర్డినేటర్ సతీష్ అరోరా

కూకట్‌పల్లి: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అధ్యక్షతన మల్కాజ్‌గిరి పార్లమెంటరీ ఎన్నికల సన్నాహక సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయం సాధించే దిశగా కృషి చేయాలన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం కొద్ది ఓట్ల తేడాతో పార్టీ ఓటమి పాలైందన్నారు. లోపాలు ఏమైన ఉంటే సరిదిద్దుకొని ప్రజల్లోకి వెళ్లాలని పిలుపునిచ్చారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటు వారి సమస్యలను తెలుసుకుంటూ ముందుకు వెళ్తున్నామని అన్నారు.

◆ అందుకే కూకట్‌పల్లి నియోజకవర్గంలో 72వేల అత్యధిక మెజార్టీలో తనను గెలిపించారని చెప్పారు. అదే విధంగా రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో నియోజకవర్గం నుంచి అత్యధిక మెజార్టీ అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేటీఆర్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రజానాయకుడని కొనియాడారు. అత్యధిక మెజార్టీ సాధించిన వారిలో ముందు వరుసలో ఉన్నారని కితాబిచ్చారు. కూకట్‌పల్లి నియోజకవర్గ ప్రజలు ×అన్న•అంటే నేనున్నానంటూ అండగా ఉంటున్నారని పేర్కొన్నారు. ఇదే ధోరణితో ముందుకు వెళ్లాలని సూచించారు.

అన్నప్రాసన



టీపీసీసీ కార్యదర్శి యాదగిరి మనుమరాలిని ఆశీర్వాదిస్తున్న బండి రమేష్

ఓల్డ్‌బోయిన్‌పల్లి: టీపీసీసీ కార్యదర్శి దండుగుల యాదగిరి మనుమరాలి అన్నప్రాసన కార్యక్రమానికి కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ బండి రమేష్ పాల్గొని ఆశీర్వాదించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జునయాదవ్, ప్రదీప్, ప్రకాశ్, సంపత్‌కుమార్ రెడ్డి, అశోక్, దేవయ్య, సందీప్, కపీల్, చింటూ, అంజీ తదితరులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు



కూకట్‌పల్లి: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సలహాదారుగా నియమితులైన వేం నరేందర్‌రెడ్డిని, ఢిల్లీలో ప్రత్యేక ప్రతినిధులుగా నియమితులైన డా. మల్లు రవి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ శాఖలకు సలహాదారుగా నియమితులైన షబ్బీర్ ఆలీని ఆదివారం పీసీసీ సభ్యుడు, టీపీసీసీ అధికార ప్రతినిధిడా. సత్యం శ్రీరంగం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

కానిస్టేబుల్ సత్యంకు ఉత్కృష్ట సేవా పతకం

దుండిగల్: విధుల్లో ఉత్తమ సేవలు అందించినందుకు దుండిగల్ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ సత్యంకు కేంద్ర హోంశాఖ ఉత్కృష్ట సేవా పతకాన్ని అందజేసింది. ఈ మేరకు సైబరాబాద్ కమిషనరేట్ కార్యాలయంలో కమిషనర్ అవినాష్ మహంతి ఉత్కృష్ట పథకాన్ని కానిస్టేబుల్ సత్యంకు అందజేశారు. ఈ సందర్భంగా దుండిగల్ సీఐ శంకరయ్య, ఎస్సైలు, సిబ్బంది సత్యంకు శుభాకాంక్షలు తెలిపారు.

శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధే ప్రధాన లక్ష్యం



కూకట్‌పల్లి డివిజన్‌లో పర్యటిస్తున్న జగదీశ్వర్ గౌడ్, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు

ఆల్విన్‌కాలనీ: ప్రజా పాలనకు నిదర్శనంగా కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలన సాగిస్తోందని శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. ప్రతి బస్తీలో పర్యటించి సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజలకు అన్ని విధాలుగా అందేలా చూస్తామని పేర్కొన్నారు. ఆదివారం కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని పాపారాయుడునగర్, ఆస్‌బెస్టాస్ కాలనీ, పాపిరెడ్డినగర్, హనుమాన్ నగర్, ప్రగతినగర్, దీనబంధు కాలనీల్లో నియోజకవర్గ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

దేశ ఆర్థికాభివృద్ధిలో యువత భాగస్వామ్యం కావాలి



కూకట్‌పల్లి: దేశ ఆర్థికాభివృద్ధిలో యువత భాగస్వామ్యం కావాలని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యులు పి.విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. కూకట్‌పల్లి వివేకానంద డిగ్రీ కళాశాలలో ఆదివారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశం భారతదేశం అని యువత దేశ ఆర్థిక వ్యవస్థలో ముందుండాలని ప్రధాని మోదీ రాబోయే రెండు సంవత్సరాలు భారతదేశం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఐదో స్థానం నుంచి మూడోస్థానానికి రాబోతుందన్నారు. కళాశాల చైర్మన్ డాక్టర్ నరేష్ మాట్లాడుతూ డిగ్రీలో ఉత్తీర్ణులైన విద్యార్థులను అభినందిస్తూ ఎంప్లాయిమెంట్ సీకర్స్‌గా ఉండొద్దని క్రియేటర్స్‌గా ఉండాలనినారు. అప్పుడే సమాజంలో ఉన్నత స్థానాలకు ఎదుగుదామని తెలిపారు. మంచి నడవడికతో మంచి పౌరులుగా మెలగాలని అప్పుడే తల్లిదండ్రులకు చదువు చెప్పిన అధ్యాపకులకు గర్వకారణంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలేజీ డైరెక్టర్ కేవీ లావణ్య, డి.మౌనిక, ప్రిన్సిపల్ బీఎస్.రాజేష్, వనిత డిగ్రీ కాలేజ్ ఫర్ ఉమెన్ ప్రిన్సిపల్ రాజయ్య, సంగమిత్రా డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ షేక్ మీరావలి తదితరులు పాల్గొన్నారు.